
వెండి శంఖుధార, చక్రధార అందజేత



ఆలయ అర్చకులకు వెండి శంఖుధార, చక్రధారలను అందజేస్తున్న భకుడు శ్రీనివాస్

చంపాపేట: కర్మన్‌ఘాట్ ధ్యానాంజనేయ స్వామివారికి నిత్యం నిర్వహించే సింధూర అభిషేకంలో ఉపయోగపడే వెండి శంఖుధార, చక్రధారలను ఆదివారం చంపాపేటకు చెందిన భక్తుడు శ్రీనివాస్ ఆలయ ఈఓ లావణ్య సమక్షంలో అందజేశారు. అనంతరం ఆలయ అర్చకులు శ్రీనివాస్‌ను వేద మంత్రోచ్ఛరణలతో ఆశీర్వదించి స్వామివారి తీర్థప్రసాదాలు, శేష వస్త్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ పాలక మండలి చైర్మన్ సత్యనారాయణరెడ్డి, తాజా, మాజీ సభ్యులు మధుసాగర్, శ్రీనివాస్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, ఆలయ అర్చకులు అంబా ప్రసాద్, ప్రవీణ్‌శర్మ, సంతోష్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

హెల్మెట్ ధరించాల్సిందే..



హెల్మెట్ ధరించాలని ప్రమాణం చేయిస్తున్న ఏసీపీ కృష్ణయ్య

చైతన్యపురి: స్వీయ రక్షణలో భాగంగా ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఎల్‌బీనగర్ ఏసీపీ కృష్ణయ్య అన్నారు. విజిబుల్ పోలీస్‌లో భాగంగా సరూర్‌నగర్ ఇన్‌స్పెక్టర్ సైదిరెడ్డి, ఎస్సై లక్ష్మయ్య ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం సరూర్‌నగర్ మినీ ట్యాంక్‌బండ్, ప్రియదర్శిని పార్కు ప్రాంతాల్లో వాహనాల తనిఖీలు నిర్వహించారు. హెల్మెట్ ధరించాల్సిన ఆవశ్యకతపై వాహనదారులకు అవగాహన కల్పించారు. హెల్మెట్ ధరించి వాహనాలు నడుపుతామని వారితో ప్రమాణం చేయించారు.

ఎల్‌ఓసీ పత్రం అందజేత



మన్సూరాబాద్: సీఎం రిలీఫ్ ఫండ్‌తో పేదలకు కార్పొరేట్ వైద్యం ఉచితంగా అందుతోందని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. లెక్చరర్స్ కాలనీకి చెందిన యశస్విని (9) పుట్టినప్పటి నుంచి ఎదుగుదల లేక బాధపడుతోంది. పలు హాస్పిటల్స్ సంప్రదించగా చిన్నారికి ఖరీదుతో కూడిన ఇంజెక్షన్లను ఇవ్వాలని వైద్యులు సూచించారు. వైద్య ఖర్చులు భరించలేని స్థితిలో ఉన్న చిన్నారి తండ్రి క్రాంతికుమార్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డిని ఆశ్రయించారు. స్పందించిన ఎమ్మెల్యే సీఎం సహాయనిధి నుంచి రూ.1.10లక్షల ఎల్‌ఓసీ చెక్కును మంజూరు చేయించారు. ఇట్టి చెక్కును ఆదివారం బాధిత తండ్రి క్రాంతికుమార్‌కు ఎమ్మెల్యే అందజేశారు.

బోనాల పండగను ప్రశాంతంగా జరుపుకోవాలి


చాదర్‌ఘాట్ ఇన్‌స్పెక్టర్ మురారి



చాదర్‌ఘాట్: మలక్‌పేటలో ఈనెల 20, 21 తేదీలలో జరిగే బోనాల పండగను ప్రశాంతంగా జరుపుకొని పోలీసులకు సహకరించాలని చాదర్‌ఘాట్ ఇన్‌స్పెక్టర్ మురారి అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ... ఫలహారం బండ్లు, తొట్టెల నిర్వాహకులు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో రిజిస్టర్ చేసుకుంటే బందోబస్తు ఏర్పాటు చేస్తామని తెలిపారు. డీజేలకు అనుమతులు లేవని ఎవరైనా డీజేను పెడితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ప్రతి రూట్‌లో సీసీ కెమెరాలు, పోలీసుల బందోబస్తు ఉంటుందనఆరు. ప్రతి దేవాలయం దగ్గర స్థానిక పీస్ కమిటీ సభ్యులు, దేవాలయ ట్రస్టీ సభ్యులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

ఘనంగా ఏకలవ్య జయంతి

మన్సూరాబాద్: తెలంగాణ ఆదివాసీ ఎరుకల సంఘం ఆధ్వర్యంలో ఏకలవ్య జయంతిని ఎరుకల నాంచారమ్మబస్తీలో ఆదివారం నిర్వహించారు. సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కొనేటి నరసింహ ముఖ్యఅతిథిగా హాజరై ఏకలవ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాయపురం వెంకటేశ్వర్లు, ఉంగ్రాతి రవికుమార్, వీరన్న, భరత్, స్వామి, రాజు, సుదర్శన్, దేవర శివ, భిక్షపతి, వీరయ్య, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



ఏకలవ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న తెలంగాణ ఆదివాసీ ఎరుకల సంఘం నేతలు

ఎఫ్‌ఆర్‌ఎస్‌తో అక్రమాలకు చెక్!

అంగన్‌వాడీ కేంద్రాల్లో సరుకులు పక్కదారి పట్టకుండా చర్యలు



గర్భిణుల వివరాలు నమోదు చేస్తున్న అంగన్‌వాడీ టీచర్

మలక్‌పేట: అంగన్‌వాడీ కేంద్రాలలో లబ్ధిదారులకు ఇచ్చే సరుకులు పక్కదారి పట్టకుండా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఈనెల నుంచి ఆయా కేంద్రాలలో ఫేషియల్ రికగ్నైజేషన్ సిస్టమ్ (ఎఫ్‌ఆర్‌ఎస్) ద్వారా సరుకులు అందించనుంది. ఐసీడీఎస్ చార్మినార్ సర్కిల్ పరిధిలో గర్భిణులు, బాలింతలు, చిన్నారుల ఫేస్‌తో కూడిన వివరాలు అంగన్‌వాడీ టీచర్లు మొబైల్ ట్రాకర్ యాప్‌లో నమోదు చేశారు. ఆధార్ అనుసంధానంతో వివరాలు నిక్షిప్తం చేస్తారు. త్వరలో ఎఫ్ఆర్ఎస్ అమలు కానుంది. మహిళ శిశు సంక్షేమ శాఖ నుంచి ఆదేశాలు రావడంతో లబ్ధిదారులకు ఎఫ్ఆర్ఎస్ అమలు చేయడానికి అధికారులు కార్యాచరణ చేపట్టారు.

ఓటీపీ నమోదుతోనే సరుకులు..

ఇప్పటి వరకు మ్యానువల్‌గా సరుకులు అందించి పోషణ్ అభియాన్ ట్రాకర్ యాప్‌లో నమోదు చేసే పరిస్థితి ఉండేది. ఇక నుంచి మొదట లబ్ధిదారు ఫొటో అప్‌లోడ్ చేస్తారు. అనంతరం లబ్ధిదారు మొబైల్‌కు వచ్చే ఓటీపీని పోషణ్ అభియాన్ ట్రాకర్‌లో నమోదు చేస్తే ప్రకియ పూర్తి అవుతుంది. అనంతరం సరుకులు అందిస్తారు. ఈ యాప్‌లో కొత్తగా ఫేస్ రికగ్నైజేషన్ సిస్టమ్ పొందుపరిచారు. ఈ మేరకు క్లస్టర్ల వారీగా శిక్షణ ఇచ్చారు.

చార్మినార్ సీడీపీవో పరిధిలో 274 కేంద్రాలు

అంగన్‌వాడీ కేంద్రాలలో చిన్నారులు, బాలింతలు, గర్భిణులకు పౌష్టికాహారం అందిస్తున్న సంగతి తెలిసిందే. సైదాబాద్, చార్మినార్, అంబర్‌పేట, బండ్లగూడ నాలుగు మండలాలు చార్మినార్ సీడీపీవో పరిధిలోకి వస్తాయి. 274 అంగన్‌వాడీ కేంద్రాలు, 225 మంది టీచర్లు, 168 మంది హెల్పర్లు, 10 మంది సూపర్‌వైజర్లు విధులు నిర్వర్తిస్తున్నారు. 2209 మంది గర్భిణులు, 1423 బాలింతలు, 11822 మంది ఆరేళ్ల లోపు వయస్సు ఉన్న పిల్లలు ఉన్నట్లు గణంకాలు చెబుతున్నాయి.

అక్రమాలకు చెక్..

పౌష్టికాహారం పక్కాదారి పడుతుందోన్న విమర్శలు ఉన్నాయి. లబ్ధిదారులకు సరుకులు సక్రమంగా పంపిణీ చేయకపోవడం.. కొందరు కేంద్రానికి రాకపోయినా వచ్చినట్టు నమోదు చేయడం వంటి పరిణామాలు చోటు చేసుకున్న సంఘటనలు ఉన్నాయి. అధికారుల తనిఖీల్లో చాలాసార్లు ఇవి బయటపడ్డాయి. ఈ క్రమంలో అక్రమాలకు చెక్ పెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రణాళిక రూపొందించింది. లబ్ధిదారుల హాజరు నమోదు.. నెలలో ఎంత మంది హాజరయ్యారు.. ఎందరికీ సరుకులు పంపిణీ చేశారు.? నిల్వలు, తదితర విషయాలు పారదర్శకంగా తెలుస్తాయి.

త్వరలో అమలుకు శ్రీకారం..



కేంద్రప్రభుత్వం ప్రవేశ పెట్టిన ఫేషియల్ రికగ్నైజేషన్ ప్రక్రియ కొనసాగుతోంది. లబ్ధిదారుల వివరాలు ఆన్‌లైన్ నమోదు చేశాం. ప్రస్తుతం లబ్ధిదారుల వివరాలు ఆధార్‌తో అనుసంధానం చేస్తున్నాం. అందరూ ఒకేసారిగా నమోదు చేస్తుండంతో కొంత ఆలస్యం అవుతోంది. అనుసంధానం పూర్తయిన వెంటనే నూతన ప్రక్రియ ప్రారంభమతుంది. సరుకులు పక్కాదారి పట్టకుండా నిరోధించే అవకాశం ఉంది.

– పార్వతి, సూపర్‌వైజర్, మూసారంబాగ్

బాబు జగ్జీవన్‌రామ్ గొప్ప సంఘ సంస్కర్త

మలక్‌పేట: స్వాతంత్య్ర సమరయోధులు, దేశ మాజీ ఉపప్రధాని బాబు జగ్జీవన్‌రామ్ వర్ధంతిని ఆదివారం మూసారంబాగ్‌లో నంగా నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, దళిత, ప్రజా సంఘాల నేతలు మూసీనది సమీపంలోని బీజేఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎమ్మార్పీఎస్ టీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బట్టుదాసురావు మాట్లాడుతూ.. అణగారిన వర్గాల సంక్షేమ కోసం అలుపెరుగని కృషి చేసిన గొప్ప సంఘ సంస్కర్త అని అన్నారు. ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అనంతయ్య, దళిత నాయకులు సుదర్శన్, బల్వంత్, నర్సింహ, రామకృష్ణ, ధన్వంత్, గోపాల్, బాబు శ్రీనివాస్, రాజు, శ్రీను, సతీష్ తదితరులు ఉన్నారు.

◆ **మన్సూరాబాద్:** మాజీ ఉపప్రధాని బాబు జగ్జీవన్‌రామ్ వర్ధంతిని ఎల్‌బీనగర్‌లో పలు ప్రాంతాల్లో ఆదివారం నిర్వహించారు. డా.బీఆర్.అంబేడ్కర్, బాబు జగ్జీవన్‌రావ్ ఎల్‌బీనగర్ ఉత్సవాల కమిటీ కన్వీనర్ ఆడాల రమేష్, కో కన్వీనర్ కొంగరి నర్సింహారావు ఆధ్వర్యంలో ఎల్‌బీనగర్‌లో వర్ధంతి వేడుకలు జరిగాయి. బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా మాజీ అధ్యక్షుడు సామ రంగారెడ్డి, మన్సూరాబాద్ మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్‌రెడ్డితో పాటు పలువురు దళిత సంఘాల నేతలు హాజరై జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బీఎన్‌రెడ్డినగర్‌లో బీఆర్‌ఎస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు కటికరెడ్డి అరవిందరెడ్డి సాహెబ్‌నగర్‌లోని జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.



మలక్‌పేటలో నివాళులర్పిస్తున్న దాసురావు, మాల సంఘం నేత బల్వంత్



విగ్రహానికి పూలమాలలు వేస్తున్న కార్మిక సంఘం నేతలు అనంతయ్య, ధన్వంత్



సాహెబ్‌నగర్‌లో నివాళులర్పిస్తున్న బీఆర్‌ఎస్ నేత కటికరెడ్డి అరవింద్‌రెడ్డి



ఎల్‌బీనగర్‌లో నివాళులర్పిస్తున్న మన్సూరాబాద్ మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్‌రెడ్డి, రంగారెడ్డి అర్బన్ జిల్లా బీజేపీ మాజీ అధ్యక్షుడు సామ రంగారెడ్డి

శ్యామాప్రసాద్ ముఖర్జీకి ఘన నివాళి



డా. శ్యామాప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అర్బన్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి

మన్సూరాబాద్: జన సంఘ్ వ్యవస్థాపకుడు డాక్టర్ శ్యామాప్రసాద్ ముఖర్జీ జయంతిని ఆదివారం ఎల్బీనగర్ నియోజకవర్గంలో ఘనంగా నిర్వహించారు. మన్సూరాబాద్‌లోని రంగారెడ్డి అర్బన్ జిల్లా బీజేపీ కార్యాలయంలో అధ్యక్షుడు వనిపల్లి శ్రీనివాస్‌రెడ్డి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు హరీష్‌రెడ్డి, మల్లేష్‌గౌడ్, ఆదినారాయణరెడ్డి, రాజేంద్రప్రసాద్, నరేష్‌యాదవ్, కిరణ్‌కుమార్‌రెడ్డి, పాతూరి శ్రీధర్‌గౌడ్,మంగారెడ్డి, గుండె కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

కొత్తపేటలో మొక్కలు నాటిన కార్పొరేటర్

నాగోలు: కొత్తపేట డివిజన్ బీజేపీ అధ్యక్షుడు మంచి రాజేష్‌కుమార్, బీజేపీ నాయకురాలు కాట విజయాగౌడ్ ఆధ్వర్యంలో శ్యామాప్రసాద్ ముఖర్జీ జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా కొత్తపేట కార్పొరేటర్ నాయికోటి పవన్‌కుమార్ ముఖ్యఅతిథిగా హాజరై శ్యామాప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం జయంతి సందర్భంగా కాలనీలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో నాయకులు జంగారెడ్డి, అశ్విన్ సింగ్ ఠాకూర్, నాయికోటి ప్రదీప్ కుమార్, జస్పాల్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీతోనే భారత్ భద్రం

చంచల్‌గూడ: జన్ సంఘ్ వ్యవస్థాపక సభ్యుడు శ్యామాప్రసాద్ ముఖర్జీ జయంతిని ఆదివారం కుర్మగూడ డివిజన్ భరత్‌నగర్‌లో నిర్వహించారు. పార్టీ జాతీయ కౌన్సిల్ సభ్యుడు సహదేవ్‌యాదవ్ నివాళులర్పించి మాట్లాడారు. నాడు భారత్‌కు శాపమైన నెహ్రూ పాలనను ముఖర్జీ ఎదురించి పోరాడారన్నారు. ఎన్ని తరాలు గడిచినా బీజేపీ పాలనతోనే భారత్ భద్రంగా ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు బండ వెంకట్‌రెడ్డి, తంగెళ్ల సుధీర్, యుగేందర్, నాగరాజు, లడ్డు, వరుణ్, ఈశ్వర్‌యాదవ్, లలిత, సత్యవతి పాల్గొన్నారు.



కొత్తపేటలో మొక్కలు నాటుతున్న కార్పొరేటర్ పవన్‌కుమార్, బీజేపీ నాయకులు



భరత్‌నగర్‌లో ముఖర్జీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సహదేవ్‌యాదవ్, నాయకులు

'ఇరవై ఏళ్ల కల నేడు సాకారమైంది'

మన్సూరాబాద్: కాలనీవాసుల ఇరవై ఏళ్ల కల... నేడు సాకారమైందని మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి పేర్కొన్నారు. డివిజన్ పరిధి వివేకానందనగర్ కాలనీలోని నూతనంగా నిర్మించిన సీసీ రోడ్డును ఆదివారం ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ... వివేకానందనగర్‌కాలనీలో సీసీ రోడ్డు వేయటానికి అనేక అడ్డంకులు ఎదురయ్యాయని కోర్టు కేసులు, ప్లాట్ల ఓవర్ ల్యాపింగ్ సమస్యలతో 20 ఏళ్లుగా రోడ్డును నిర్మించలేకపోయామని తెలిపారు. ఎల్‌బీనగర్ జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్‌పాటిల్ ప్రత్యేక చొరవతో రూ.47.50లక్షలతో నూతనంగా సీసీ రోడ్డు నిర్మాణం చేశామన్నారు. కాలనీలో మిగిలిపోయిన సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు సత్యపాల్‌రెడ్డి, వెంకటేష్, సురేందర్‌రెడ్డి, అశోక్, పవన్, పుష్పలత, సైదిరెడ్డి, నాయకులు నాంపల్లి రామేశ్వర్, హరీష్, సంతోష్, దామోదర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



వివేకానందనగర్‌కాలనీలో పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ నర్సింహారెడ్డి

విశ్వబ్రాహ్మణ చైతన్య యాత్ర ప్రారంభం

ఎల్‌బీనగర్ నుంచి బ్రహ్మంగారి మఠం వరకు పాదయాత్ర



విశ్వకర్మ చైతన్య యాత్రను ప్రారంభిస్తున్న బీసీ ఇంటలెక్చువల్ ఫోరం ప్రతినిధి చామకూర రాజు

మన్సూరాబాద్: ఆర్థికంగా దగాపడిన విశ్వబ్రాహ్మణులు సమస్త రంగాల్లో వెనుబడిపోయారని... విశ్వకర్మలకు తగిని గుర్తింపు ఇవ్వాలని హైదరాబాద్ నుంచి కడపలోని వీరబ్రహ్మేంద్రస్వామి మఠం వరకు విశ్వబ్రాహ్మణ చైతన్య యాత్ర ఆదివారం ఎల్‌బీనగర్‌లో ప్రారంభమయ్యింది. ఎల్‌బీనగర్‌లోని ప్రొ. జయశంకర్, తెలంగాణ మలిదశ తొలి అమరుడు కాసోజు శ్రీకాంతాచారి విగ్రహాలకు పూలమాల వేసి యాత్రను ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బీసీ ఇంటలెక్చువల్ ఫోరం ప్రతినిధి చామకూర రాజు హాజరై జెండా ఊపి ప్రారంభించారు.

1500మంది విశ్వకర్మ అభ్యర్థులను ప్రకటిస్తాం

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రోబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు అన్ని రాజకీయ పార్టీలు 42శాతం కోటాలో 400 సీట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. రాజకీయ చైతన్యం ఉన్న ప్రతి విశ్వకర్మ అవకాశం ఉన్న ప్రతి గ్రామంలో పోటీ చేయాలని పిలుపునిచ్చారు. వచ్చే రెండు నెలల్లో 1500మంది అభ్యర్థులను తయారు చేస్తామని తెలిపారు. విశ్వకర్మల డిమాండ్లను ప్రభుత్వం తక్షణమే అమలు చేయాలన్నారు. విశ్వబ్రాహ్మణ చైతన్యయాత్ర సుమారు 450 కిలోమీటర్ల పాదయాత్రగా సాగుతుందని తెలిపారు.

సుభద్రానగర్ కాలనీ అభివృద్ధికి కృషి



సుభద్రానగర్ కాలనీలో సమావేశంలో మాట్లాడుతున్న కార్పొరేటర్ నవజీవన్‌రెడ్డి

వనస్థలిపురం: సుభద్రానగర్ కాలనీలో సమస్యలు పరిష్కరించి కాలనీ అభివృద్ధికి కృషి చేస్తానని హయత్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి అన్నారు. ఆదివారం డివిజన్ పరిధిలోని సుభద్రానగర్ కాలనీ సంక్షేమ సంఘం భవనంలో కాలనీవాసులు ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ప్రధాన సమస్యగా మారిన సర్వే నం.14లోని ప్రొహిబిటెడ్ ఏరియా, మంచినీరు, భూగర్భ డ్రైనేజీ సమస్యలను స్థానికులు కార్పొరేటర్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ... ఈ సమస్యలను ఇప్పటికే అధికారుల దృష్టికి తీసుకెళ్లామని పేర్కొన్నారు. త్వరలోనే సమస్యలకు పరిష్కారం లభిస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు లక్ష్మణస్వామి, సుబ్రహ్మణ్యం, నరసింహారావు, సత్యనారాయణ, జ్ఞానానందం తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర విధానాలనే రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తోంది

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ



10 గంటల పనిదినాల జీవో ప్రతిని తగులబెడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ

హస్తినాపురం: రాష్ట్రంలో ప్రధాని నరేంద్రమోడీ ప్రభుత్వ విదానాలనే రేవంత్‌రెడ్డి ప్రభుత్వం అనుసరిస్తూ కార్మిక వ్యతిరేక నిర్ణయాలు తీసుకుంటుందని తెలంగాణ రాష్ట్ర సీపీఎం(ఎం) కార్యదర్శి జాన్‌వెస్లీ విమర్శించారు. ఆదివారం హస్తినాపురం డివిజన్ నందనవనం కాలనీలో సీపీఎం ఎల్‌బీనగర్ సర్కిల్ కార్యదర్శి ఆలేటి ఎల్లయ్య అధ్యక్షతన మున్సిపల్ కార్మికుల సమావేశం జరిగింది. కార్మికులకు వ్యతిరేకంగా తీసిన 10 గంటల పనిదినాల జీవోను జాన్‌వెస్లీ తగుల బెట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... కార్మిక చట్టాలను నాశనం చేసే విధంగా కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన 10గంటల పనిదినాల జీవోను వెంటనే వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

◆ మున్సిపాలిటీలలో 25ఏళ్లుగా పనిచేస్తున్న కార్మికులకు పర్మినెంట్ ఉద్యోగ హోదా ఇప్పించకుండా ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని విమర్శించారు. కార్మికుల కనీస వేతనాన్ని రూ.26వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. జూలై 9న నిర్వహించే సమ్మెను కార్మికులు విజయవంతం చేయాలన్నారు. కార్మికులు ప్రజలు పెద్ద ఎత్తున ఈ సమ్మెలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ధర్మానాయక్, సీపీఎం జిల్లా నాయకులు ఎం.చంద్రమోహన్, కీసర నర్సిరెడ్డి, సీహెచ్.వెంకన్న, ఎం.వీరయ్య, మంధని యాదయ్య, పి.వీరస్వామి, దుర్గారావు, రవీందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో తొలి ఏకాదశి

భక్తులతో కిటకిటలాడిన వైష్ణవ దేవాలయాలు



అష్టలక్ష్మి ఆలయంలో శ్రీమన్నారాయణ స్వామి



వేంకటేశ్వరస్వామికి పూజలు నిర్వహిస్తున్న భక్తులు

దిల్‌సుఖ్‌నగర్: భక్తులు ఉపవాస దీక్షలతో, భక్తి ప్రపత్తులతో తొలి ఏకాదశి పర్వదినాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆదివారం మలక్‌పేట్‌జోన్ పరిధిలో ఏకాదశి పర్వదినాన్ని భక్తిప్రపత్తులతో జరుపుకున్నారు. ఈ పర్వదినాన్ని దిల్‌సుఖ్‌నగర్, ఆర్‌కేపురం, సరూర్‌గనగర్, సైదాబాద్, మలక్‌పేట, చాదర్‌ఘాట్, అక్బర్‌బాగ్, మాదన్నపేట తదితర ప్రాంతాలలో ఉదయం నుంచే భక్తులతో ఆలయాలు కిటకిటలాడాయి. ఉపవాస దీక్షతో భక్తులు ఆలయాలలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆర్‌కేపురం వాసవికాలనీ అష్టలక్ష్మి ఆలయంలో ఉదయం నుంచే ప్రత్యేక పూజలు మొదలయ్యాయి. ఈ సందర్భంగా వైష్ణవ దేవాలయాలతో పాటు శివాలయాలను పూలమాలలతో అందంగా ముస్తాబు చేశారు. ఈ సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా స్వామివారిని ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

మన్సూరాబాద్ డివిజన్‌లోని ఆలయాలు..

మన్సూరాబాద్: తొలి ఏకాదశి వేడుకలు మన్సూరాబాద్‌లోని పలు దేవాలయాల్లో ఆదివారం ఘనంగా నిర్వహించారు. తెల్లవారు జాము నుంచే భక్తుల రద్దీతో ఆలయాలు కిటకిటలాడాయి. భక్తులు ప్రత్యేక అర్చనలు, పూజలు చేపట్టారు. మన్సూరాబాద్ ఆదిత్యానగర్‌కాలనీ, విజయశ్రీకాలనీలలోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయాల్లో భక్తులు అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ మోహన్‌రెడ్డి, చైర్‌పర్సన్ సంతోష్‌కుమారి, రవికుమార్, జీకే గుప్తా, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

గడ్డిఅన్నవర క్షేత్రంలో సత్యనారాయణస్వామి వ్రతాలు

చైతన్యపురి: తొలి ఏకాదశి సందర్భంగా దిల్‌సుఖ్‌నగర్‌లోని గడ్డిఅన్నవర క్షేత్ర శ్రీవీర వేంకటసత్యనారాయణ స్వామి ఆలయంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. అభిషేకాల అనంతరం 150 మంది దంపతులతో సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు జరిపించి భక్తులకు అన్నప్రసాద వితరణ చేసినట్లు ఆలయ చైర్మన్ లింగారెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ కమిటి సభ్యులు రమణయ్య, వక్కలంక శ్రీనివాస్, పాల్ది శ్రీనివాస్, వూర నర్సింహ గుప్త, ఎస్‌ఆర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



స్వామివారి దర్శనం కోసం బారులు తీరిన భక్తులు





ఆదిత్యానగర్ వేంకటేశ్వరస్వామి దేవాలయంలో పూజలు